సాక్షి వికారాబాద్

శుక్రవారం, 9, మే, 2025



ట్యాక్స్ కట్టేవారు అనర్హులు

ఆదాయ పన్ను కట్టేవారు ఇందిరమ్మ ఇళ్లకు అనర్హులని జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణయ్య అన్నారు. 10లో ▸



సన్నబియ్యంపై కన్ను!

రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న సన్నబియ్యాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. 10లో ▸



రోడ్డుకు మోక్షం కలిగేనా?

మోమిన్‌పేట మండలం ఎన్కేపల్లి రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరైనా పనులు మాత్రం పూర్తికాలేదు. 11లో ▸

న్యూస్‌రీల్

ఆలయాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయండి

ఎమ్మెల్యే బీఎమ్మార్



ఆలయ నూతన పాలక మండలి సభ్యులతో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు టౌన్: ఆలయాల అభివృద్ధి కోసం కమిటీ సభ్యులు ప్రణాళికలు సిద్ధం చేయాలని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సూచించారు. గురువారం తాండూరు పట్టణంలోని శ్రీ కాళికాదేవి దేవస్థాన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. తాండూరు నియోజకవర్గ పరిధిలోని పలు దేవాలయాలకు పాలక మండలిని ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తోందన్నారు. అనంతరం దేవాదాయశాఖ అధికారులు ఆలయ పాలక మండలి సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ధారాసింగ్, ఉత్తం చంద్, డాక్టర్ సంపత్ కుమార్, ఆధ్యాత్మిక గురువు శంకర్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రత్యేక లోక్ అదాలత్

- చెక్ బౌన్స్ కేసుల్లో రాజీ మార్గం
- తాండూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శివలీల



తాండూరు టౌన్: తాండూరు కోర్టులో ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శివలీల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సూచన మేరకు లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. చెక్ బౌన్స్ కేసుల విషయంలో ఇరువర్గాల అంగీకారం మేరకు కేసులను పరిష్కరించనున్నట్లు పేర్కొ న్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప



తాండూరు టౌన్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యు.బుగ్గప్ప గురువారం ఒక ప్రకటనలో కోరారు. జాబితాలో నిరుపేదలు, ఇళ్లు లేని వారిని మాత్రమే చేర్చాలన్నారు. ఒకే ఇంట్లో ఉమ్మడి కుటుంబంగా ఉంటున్న, సొంత స్థలం ఉన్నప్పటికీ అద్దెకు ఉంటున్న వారికి, కడు పేదరికంలో ఉన్న వారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గతంలో ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఫొటో మానిటరింగ్ సిస్టమ్ ఉండేదని, పారదర్శకత కోసం అధికారులు నేరుగా పేదలు నివసించే ప్రాంతానికి వెళ్లి లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. అనర్హులకు ఒక్క ఇల్లు ఇచ్చినా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

రాజీవ్ యువ వికాసానికి 3,184 దరఖాస్తులు



ఎంపీడీఓ రతన్‌సింగ్

తాండూరు రూరల్: రాజీవ్ యువ వికాసం పథకానికి పెద్దేముల్ మండలం నుంచి 3,184 దరఖాస్తులు వచ్చినట్లు ఆ మండల ఎంపీడీఓ రతన్‌సింగ్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు హార్డ్ కాపీ, బ్యాంక్ ఖాతా నంబర్, పాన్, ఆధార్ కార్డులు, కులం, ఆదాయం సర్టిఫికెట్లను పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలని సూచించారు. సిబిల్ స్కోర్ ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే బ్యాంక్ అధికారులకు దరఖాస్తు ఫారాలు అందజేశామని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారుల కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ఆ తర్వాత ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం బీసీ కార్పొరేషన్ కింద 244 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు.

సమాఖ్యలో రాజకీయం!

కొందరు నేతల కనుసన్నల్లోనే మహిళా సంఘాల ఎన్నికలు

- అధికారులకు అనుకూలంగా ఉండేవారినే ఎంపిక
- మూడు రోజుల క్రితం గుట్టుచప్పుడు కాకుండా ప్రక్రియ పూర్తి
- మండల, క్లస్టర్ స్థాయిలోనూ ఇదే తంతు



ఇటీవల ఎన్నికైన జిల్లా మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం

వికారాబాద్: పారదర్శకంగా.. తటస్థంగా.. స్వతంత్రంగా జరగాల్సిన ఎన్నికల్లో రాజకీయ జోక్యం పెరిగిపోతోంది. ఇందుకు జిల్లా మహిళా సమాఖ్య ఎన్నికలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. మూడు రోజుల క్రితం ఎలాంటి ప్రకటన విడుదల చేయకుండానే కొందరు నేతల కనుసన్నల్లోనే ఇవి జరిగాయి. ఐకేపీ అధికారులకు అనుకూలంగా ఉండే వారినే ఎంపిక చేశారనే విమర్శలు ఉన్నాయి. గ్రామ సంఘాల ఎన్నికలు మొదలు.. మండల, క్లస్టర్, జిల్లా స్థాయిలోనూ ఇదే తరహాలో వ్యవహరించారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నెల 5న జిల్లాలో మహిళా సమాఖ్య ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, నూతన కార్యవర్గానికి సంబంధించి పదాధికారులను ఎన్నుకున్నారు. ఎన్నికల విషయంలో మహిళా సంఘాల సభ్యులు, పలు మండలాల అధ్యక్షులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించలేదని ఆరోపిస్తున్నారు.

ఎన్నికల బైలా ఇలా..

ఎన్నికల బైలా ప్రకారం గ్రామ, మండల, జిల్లా సమాఖ్యలకు అధ్యక్షులుగా ఎన్నికైన వారు మూడు పదవుల్లో కలిపి మూడు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం కొనసాగడానికి వీలు లేదు. మండల సమాఖ్య అధ్యక్షురాలిగా ఎన్నికైన వారు అంతకు ముందే గ్రామ సంఘం అధ్యక్షురాలిగా రెండేళ్లు కొనసాగితే మండల సమాఖ్య అధ్యక్షురాలిగా ఏడాది మాత్రమే బాధ్యతలు వహించి అనంతరం వేరే వారికి ఆ బాధ్యతలు అప్పగించాలి. మండల, జిల్లా సమాఖ్యలోనూ ఇదే పద్ధతి పాటించాల్సి ఉంటుంది. కార్యవర్గం ఎన్నికలో లాటరీ పద్ధతి పాటించరాదు. మెజార్టీ సభ్యుల ఆమోదంతో ఎంపిక జరగాలి.

జిల్లాలో మండల సమాఖ్యలు: 19	
స్వయం సహాయక సంఘాలు: 13,138	
సభ్యులు: 1.40 లక్షలు	

అన్నీ పక్కన పెట్టి..

జిల్లాలో మొత్తం 19 మండల సమాఖ్యలు.. 13,138 స్వయం సహాయక సంఘాలు.. 1.40 లక్షల సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే గ్రామ, మండల సమాఖ్యలకు కార్యవర్గాలు ఉన్నాయి. రెండు మండల సమాఖ్యలకు ఒకటి చొప్పున క్లస్టర్లు ఏర్పాటు చేసి.. క్లస్టర్‌కు ఒకరి చొప్పున ఎన్నుకున్నారు. వీరు జిల్లా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, పదాధికారులను ఎన్నుకున్నారు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ప్రక్రియలో బైలా నిబంధనలు పాటించలేదని కొందరు సభ్యులు ఆరోపిస్తున్నారు. ఉదాహరణకు పరిగి క్లస్టర్‌లో నలుగురు మహిళా అధ్యక్షులు కలిసి ఒకరిని ఎన్నుకోవాల్సి ఉండగా ఇందులో ఇద్దరు పోటీ పడ్డారు. మిగతా ఇద్దరు ఒకరిని ఎన్నుకునేందుకు నిర్ణయించుకోగా ఓటింగ్ పెట్టకుండా ల్యాటరీ పద్ధతిలో ఒకరిని ఎన్నుకున్నారు. దీంతో మిగతా ఇద్దరు మహిళల మద్దతు ఉన్న సభ్యురాలు కాకుండా మరో మహిళ ఎన్నికయ్యింది. ఎన్నికల అధికారులకు జిల్లాకు చెందిన కొంత మంది ముఖ్య నేతలు ఫోన్లు చేసి వారు సూచించిన వారినే ఎన్నుకునేలా ఒత్తిడి తెచ్చినట్లు సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం పలు రాయితీలు, ఉపాధి అవకాశాలు మహిళా సంఘాల ద్వారానే కల్పిస్తున్న నేపథ్యంలో రాజకీయ ప్రమేయం మరింత పెరిగింది.

లక్ష్యం పక్కదారి..

మహిళలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా పురోగతి సాధించాలనే ఉద్దేశంతో 1996లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థను ఏర్పాటు చేశారు. మహిళలు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలు, దురాచారాల నుంచి వారిని బయటపడేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదట్లో సంస్థ అధికారులు, ఉద్యోగులు ఈ దిశగా పని చేశారు. ప్రస్తుతం ఆ దృక్పథాన్ని గాలికొదిలేశారు. కేవలం రుణాలు ఇప్పించడం.. తిరిగి వసూలు చేయడంపైనే దృష్టి సారించారు. దీంతో అనుకున్న లక్ష్యం పక్కదారి పడుతోంది. ఉదాహరణకు పరిగి మండలానికి చెందిన ఓ మహిళా సభ్యురాలు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా చాలా కాలం పని చేశారు. ఆమె పదవిలో ఉన్నంత కాలం సభలు, సమావేశాలు, మీటింగుల కోసం తిప్పడం తప్ప.. ఆమె ఆర్థిక ఎదుగుదలకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం ఆమె ఇళ్లలో పనిచేసుకుంటూ కాలం వెళ్లదీస్తోంది. మహిళా సమాఖ్య ఎన్నికల్లో లాటరీ పద్ధతి పాటించడంపై డీపీఎం వీరయ్యను వివరణ కోరగా మహిళల కోరిక మేరకే అలా వ్యవహరించామని తెలిపారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.



మోమిన్‌పేట: పూజలో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

ఆధ్యాత్మిక చింతన అవసరం

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని సయ్యద్‌అల్లిపూర్ హనుమాన్ ఆలయంలో ధ్వజస్తంభ, నవగ్రహాలు, బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక సమాజంలో ప్రజలు ఎన్నో ఒత్తిడిలకు గురవుతుంటారని.. ఇలాంటి సమయంలో దైవారాధన చేస్తే మానసిక ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్‌గౌడ్, మండల కార్యదర్శి సురేందర్, నాయకులు మాణయ్య, నరోత్తంరెడ్డి, మహంత్‌స్వామి, ఎరాజ్, సుభాష్ పాల్గొన్నారు.

రథోత్సవంలో..

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో బుధవారం రాత్రి శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి రథోత్సవం వైభవంగా సాగింది. ఈ శోభాయాత్రలో చిన్నారులు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వేడుకల్లో స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో..

బంట్వారం: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని రొంపల్లిలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవ భక్తిని అలవర్చుకుని ప్రశాంత జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, నాయకులు రాములు యాదవ్, రాధాకృష్ణ గౌడ్, మొగులయ్య, పురుషోత్తంరెడ్డి, కోట చంద్రశేఖర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేద్దాం

టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

అనంతగిరి: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం వికారాబాద్‌లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్‌ను, అసోసియేట్ అధ్యక్షుడిగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఆనంద్, ఉపాధ్యక్షుడిగా ఎంపీఓ సఫీవుల్లాఖాన్, జాయింట్ సెక్రటరీగా పరహీన్ ఖాతూన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, సెంట్రల్ కమిటీ సభ్యుడు కోటాజీ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రామారావు, శ్రీరాంరెడ్డి పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌రావు



భారత సైన్యానికి సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్ తదితరులు

భారత సైన్యానికి సెల్యూట్

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- జాతీయ జెండాలతో ప్రదర్శన

పరిగి: చాలా కచ్చితత్వంతో పాక్ ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసిన భారత సైన్యానికి ప్రతి ఒక్కరూ సెల్యూట్ చేయాల్సిందేనని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంతో గురువారం పరిగి పట్టణ కేంద్రంలోని కొడంగల్ చౌరస్తాలో భారత సైన్యానికి సంఘీభావంగా జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారమే ఆపరేషన్ సిందూర్ అని పేర్కొన్నారు. భారత సైన్యం ఉగ్రమూకలను అంతమొందించడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. వ్యూహాత్మకంగా మెరుపు దాడులతో పాకిస్తాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి విజయవంతంగా ఆపరేషన్‌ను పూర్తి చేసి దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటారన్నారు. త్రివిధ దళాల పనితీరు అభినందనీయమన్నారు. దేశ పౌరులను సైన్యం కాపాడుతుందని.. వారి త్యాగాన్ని ఎన్నటికీ మరవలేమన్నారు. దేశ భద్రత విషయంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పార్టీ ప్రధాన కార్యదర్శి హన్మంత్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, దోమ మండల అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, సురేందర్ నాయకులు పాలాద్రి శ్రీనివాస్, యాదవరెడ్డి, శ్రీనివాస్, శాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో రైతులకు మేలు

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ధారూరు: గతంలో భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని.. భూ భారతి చట్టం అందుబాటులోకి వస్తే ఆ సమస్య ఉండదని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. కొత్త చట్టం ద్వారా గ్రామాల్లోనే భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు చక్కటి అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. గురువారం మండలంలోని నర్సాపూర్, గడ్డమీది గంగారం గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి పరంగా ఏదైనా తప్పు జరిగితే ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఆర్డీఓ స్థాయిలో కూడా తప్పు జరిగితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి సవరించుకోవచ్చని వివరించారు. గతంలో మిస్సింగ్ సర్వే నంబర్ తెలుసుకునేందుకు మీ సేవ కేంద్రంలో రూ.1,300 చెల్లించాల్సి వచ్చేదని, భూ భారతిలో ఫిర్యాదు చేస్తే సరిచేసే వీలుందని తెలిపారు. అనంతరం రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. రెండు గ్రామాల నుంచి భూ సమస్యల పరిష్కారం కోసం 36 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్లు శ్రీనివాస్, సాజిదాబేగం, డీటీ విజయేందర్, ఆర్ఐ స్వప్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులు ఇచ్చిన అర్జీలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

లక్ష్యం.. లక్షల్లో..

వనమహోత్సవానికి అధికారుల కసరత్తు

- 40,53,500 మొక్కలు నాటేందుకు ప్రణాళిక
- శాఖల వారీగా టార్గెట్



పరిగి మండలం బసిరెడ్డిపల్లిలో పెంచుతున్న మొక్కలు

వికారాబాద్: వనమహోత్సవానికి అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఎప్పటిలాగే ఈ సారి కూడా లక్ష్యాలను నిర్దేశించారు. వర్షాకాలం సమీపిస్తుండటంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గత ప్రభుత్వం హరితహారం పేరిట మొక్కలు నాటగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవం పేరుతో అమలు చేస్తోంది. శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. గత ఏడాది తరహాలోనే ఈ సారికూడా 19 ప్రభుత్వ శాఖలను భాగస్వాములను చేయనున్నట్లు తెలిసింది. అటవీ, గ్రామీణాభివృద్ధి శాఖల పర్యవేక్షణలో కార్యక్రమ రూపకల్పన చేస్తున్నారు. ఇప్పటికే ఆయా శాఖల అధికారులతో సమీక్షలు చేసి లక్ష్యాలను నిర్దేశించారు. ఈ సారి జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. వర్షాలు ప్రారంభం కాగానే మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని సమాయత్తం చేస్తున్నారు.

మరింత సమర్థవంతంగా..

గత ఏడాది 40,54,000 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా 80శాతం మేర టార్గెట్‌ను పూర్తి చేశారు. ఈ సారి కూడా 40,53,500 మొక్కల నాటాలని లక్ష్యం పెట్టుకున్నారు. గత ఏడాది కంటే మరింత సమర్థవంతంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. గతంలో నర్సరీల్లో భారీగా మొక్కలు ఎండిపోవడం, నాటిన వాటిని సక్రమంగా సంరక్షించకపోవడం తదితర కారణాలతో 80శాతం మొక్కలే బతికాయి. ఇది అధికారులు చెప్పే లెక్కలు మాత్రమే వాస్తవంగా కేవలం 50 నుంచి 60 శాతం మాత్రమే బతికాయి. ఈ సారి అలా కాకుండా నాటిన మొక్కల్లో 80 శాతానికిపైగా సంరక్షించే విధంగా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో ఖాళీ స్థలాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్‌సెంటర్లు, రోడ్లపక్కన, పొలం గట్లపై మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

609 నర్సరీల్లో..

జిల్లా వ్యాప్తంగా అటవీ, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో మొత్తం 609 నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 15, గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షణలో 594 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఉన్నాయి. టేకు మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. జీపీల్లోని ఒక్కో నర్సరీలో 5వేల నుంచి దాదాపు 30వేల మొక్కలు, 15 ఫారెస్టు నర్సరీల్లో కలిపి 10 లక్షల మొక్కలు పెంచుతున్నారు. ఫారెస్ట్ పీసెస్ కింద గచ్చకాయ, వెదురు, గుల్‌మోర్, రేన్‌ట్రీ, రావి, మర్రి, కానుగ, తురాయి, గార్డెనింగ్ మొక్కలు, దానిమ్మ, నిమ్మ, గోరింటాకు తదితర మొక్కలను పెంచుతున్నారు. హోం సీడ్ కింద (ఇళ్ల వద్ద నాటుకునేవి) పూలు, పండ్ల మొక్కలను పెంచుతున్నారు.

శాఖల వారీగా కేటాయించిన మొక్కలు

అటవీ	3.6లక్షలు
ఆర్అండ్‌బీ	5వేలు
జిల్లా పంచాయతీరాజ్	4లక్షలు
డీఆర్డీఓ, ఎంపీడీఓలు	26.87లక్షలు
నీటిపారుదల	76వేలు
వ్యవసాయ	6.38లక్షలు
మార్కెట్	5వేలు
ఉద్యానవన	2.55లక్షలు

(మరికొన్ని ఉప శాఖలకు మొక్కలు కేటాయించారు.)

సిద్ధంగా ఉన్నాం



వనమహోత్సవ కార్యక్రమానికి పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నాం. అటవీ, డీఆర్డీఓ శాఖల ఆధ్వర్యంలోని నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం. వర్షాలు పడగానే మొక్కలు నాటాలనే ఆదేశాలు జారీ చేశాం. శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించడం కూడా పూర్తయ్యింది. అన్ని శాఖల సమన్వయంతో వనమహోత్సవాన్ని విజయవంతం చేస్తాం. గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తాం. ఆ దిశగా ప్రణాళికలు రూపొందించాం.

– జ్ఞానేశ్వర్, డీఎఫ్ఓ

మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం వద్దు

ఏపీడీ సరళాకుమారి

దుద్యాల్: వన నర్సరీల్లో మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహించరాదని ఏపీడీ సరళాకుమారి సూచించారు. గురువారం దుద్యాల్ మండలం హస్నాబాద్‌లోని వన నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున నర్సరీల్లోని మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉందని, నిత్యం నీటిని అందించాలని నిర్వాహకులకు సూచించారు. వర్షాకాలం ప్రారంభం నాటికి మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, ఏపీవో రాములు తదితరులు పాల్గొన్నారు.



హస్నాబాద్‌లోని వన నర్సరీని పరిశీలిస్తున్న ఏపీడీ సరళాకుమారి

క్లుప్తంగా

ఏఈవోలకు కొత్త ఫోన్ నంబర్లు

దుద్యాల్: గ్రామాల్లో రైతులకు వ్యవసాయ సూచనలు చేసే ఏఈవోలకు కొత్త ఫోన్ నంబర్లు వచ్చాయి. గతంలో వ్యవసాయ శాఖ అందించిన ఫోన్ నంబర్లు సాంకేతిక సమస్యతో పని చేయకుండా పోయాయి. దీంతో రైతులకు పంటల సాగుపై సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఇబ్బందులు తలెత్తాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ ఏఈవోలు కొత్త ఫోన్ నంబర్లు మంజూరు చేసింది. దుద్యాల్ క్లస్టర్ పరిధిలోని దుద్యాల్, గౌరారం, హంసంపల్లి గ్రామాల ఏఈవో కే భావనకు సెల్ నంబర్ 8977768852ను కేటాయించారు. హస్నాబాద్ క్లస్టర్ పరిధిలోని హస్నాబాద్, ఆలేడ్ గ్రామాల ఏఈవో వి.రేణుక – 89777 68859, కుదురుమల్ల క్లస్టర్ పరిధిలోని కుదురుమల్ల, చిలుములమైల్వార్, సంగాయిపల్లి, మాచన్‌పల్లి, నాజుఖాన్‌పల్లి గ్రామాల ఏఈవో కే జ్యోతి – 89777 68860, పోలేపల్లి క్లస్టర్ పరిధిలోని పోలేపల్లి, హకీంపేట్, ఈర్లపల్లి, లగచర్ల గ్రామాల ఏఈవో పి.మాణికేశ్వరి – 89777 68861కు సెల్ నంబర్లను కేటాయించారు. ఆయా గ్రామాల రైతులు వ్యవసాయ సంబంధిత వివరాల కోసం పై పేర్కొనన ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఏఈవోలు సూచించారు.

పూరిల్లు దగ్ధం



కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ మల్లయ్య తదితరులు

మోమిన్‌పేట: పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని మొరంగపల్లిలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సిరివాటి దుర్గమ్మ పూరి గుడిసెలో నివాసం ఉంటోంది. డెసెలో నివాసముంటుంది. ఉదయం స్నానం చేసేందుకు పొయ్యిపై నీరు పెట్టి బయటకు వచ్చింది. అంతలో ఇంటికి మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకొని కేకలు వేసింది. చుట్టుపక్కల వారు వచ్చి ఆర్పేలోపు పూర్తిగా కాలిపోయింది. నిత్యవసర సరుకులు, బట్టలు పూర్తిగా కాలిపోయాయి. ప్రభుత్వం పేద మహిళను ఆదుకోవాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య కోరారు.

హైనా దాడిలో దూడ మృతి



హైనా దాడిలో మృతిచెందిన దూడ

కుల్కచర్ల: హైనా దాడిలో దూడ మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. అటవీశాఖ బీట్ ఆఫీసర్ మెయిన్ తెలిపిన వివరాల ప్రకారం.. లాల్‌సింగ్ తండాకు చెందిన సక్ర్య నాయక్ గురువారం తన పొలంలో దూడను కట్టేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారుజామున పొలానికి వచ్చి చూడగా దూడపై గుర్తు తెలియని జంతువు దాడి చేసి చంపేసింది. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు అక్కడ ఉన్న పాద ముద్రల ఆధారంగా దూడపై హైనా దాడి చేసిందని నిర్ధారించారు. రైతులు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని సూచించారు. అడవి జంతువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

శివసాగర్‌లోకి దూసుకెళ్లిన కారు



అనంతగిరి: వికారాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ కారు అదుపు తప్పి శివసాగర్ చెరువులోకి దూసుకెళ్లింది. నీళ్ల అంచువరకు వెళ్లి ఆగిపోవడంతో ప్రమాదం తప్పింది. అనంతరం స్థానికుల సాయంతో కారును బయటకు లాగారు.

ట్యాక్స్ కట్టేవారు అనర్హులు



తాండూరు రూరల్: కందనెల్లిలో మాట్లాడుతున్న కృష్ణయ్య తదితరులు



యాలాల: లబ్ధిదారులను విచారిస్తున్న అధికారులు

ప్రభుత్వ ఉద్యోగం ఉన్నా ఇందిరమ్మ ఇల్లు ఇవ్వరు

- హౌసింగ్ జిల్లా పీడీ కృష్ణయ్య

తాండూరు రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇన్‌కాం ట్యాక్స్ కట్టే వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయరని, అనర్హులుగా గుర్తిస్తారని జిల్లా హౌజింగ్ ప్రాజెక్ట్‌డైరెక్టర్ కృష్ణయ్య పేర్కొన్నారు. గురువారం పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామంలో లబ్ధిదారుల నివాసప్రాంతాలకు వెళ్లి ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఐదెకరాల కంటే ఎక్కువ ఉంటే ఇళ్లు మంజూరు చేయరన్నారు. ఆర్‌సీసీ స్లాబ్ ఉన్నా, ఫోర్ వీలర్స్ ఉన్నా కూడా అనార్హులుగా గుర్తిస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి ఇటింతో పాటు పాత ఇంటిని పొడిగిస్తామని చెప్పిన కూడా మంజూరు చేయరని తేల్చి చెప్పారు. ఇంటి స్థలం ఉన్న నిరుపేదలను ఎంపిక చేసి, రూ.5లక్షలు విడతల వారీగా చెల్లిస్తామని వివరించారు. ఈ విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రస్తుతం జిల్లాలోని అన్నీ గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్నారని, వారం రోజుల్లో కలెక్టర్ తుది జాబితాను విడుదల చేస్తారన్నారు. విడుదల చేసిన తర్వాత ఇంటి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దేముల్ ఎంపీడీఓ రతన్‌సింగ్, హౌజింగ్ డీఈ కలీమోద్దీన్, ఏఈ రహీం, వెరిఫికేషన్ అధికారి ఎంఈఓ నర్సింగ్‌రావు, పంచాయతీ కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ హౌస్ పరిశీలన

తాండూరు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్మిస్తున్న మోడల్ హౌస్‌ను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులకు పీడీ కృష్ణయ్య ఆదేశించారు. ఇందిరమ్మ ఇల్లు రూ.5 లక్షలతో ఎలా నిర్మించాలనే ఉద్దేశ్యంతో ప్రతి కేంద్రంలో ఓ మోడల్ హౌజ్ నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

యాలాల: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని కో ఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల నివాసప్రాంతాలకు వెళ్లి విచారణ చేపట్టారు. గ్రామంలో ఇళ్లు లేని నిరుపేదలు, ఇళ్ల స్థలం ఉండి ఇంటి నిర్మాణం చేపట్టడానికి సిద్ధంగా ఉన్న లబ్ధిదారుల జాబితాను పరిశీలించారు. అనంతరం ఏఓ శ్వేతరాణి, పంచాయతీ కార్యదర్శి గ్రామస్తుల సమక్షంలో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగయ్య, చందు, శేఖర్, మైను, లాలప్ప, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు

ఐఎస్ఐ గుర్తింపు తెచ్చుకోవాలి

- ప్లాస్టిక్ బాటిళ్లకు ప్రత్యామ్నాయం చూసుకోవాలి
- వ్యర్థ నీటిని ఇంకుడు గుంతల్లోకి వదలండి
- వాటర్ ప్లాంట్ యజమానులకు కమిషనర్ ఆదేశాలు



వాటర్ ప్లాంటు యజమానులతో సమావేశమైన మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి

తాండూరు టౌన్: పట్టణంలో కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లకు నిబంధనల ప్రకారం ఐఎస్ఐ గుర్తింపు ఉండాలని మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహా రెడ్డి అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని 70 వాటర్ ప్లాంట్ల యజమానులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఐఎస్ఐ గుర్తింపు కోసం మూడు నెలలు గడువు ఇస్తున్నట్లు చెప్పారు. తదనంతరం వాటర్ ప్లాంట్లను సీజ్ చేస్తామన్నారు. వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతారనే ఉద్దేశంతో మాత్రమే గడువు ఇచ్చినట్లు చెప్పారు. వాటర్ పంపిణీకి ఉపయోగించే ప్లాస్టిక్ బాటిళ్లను నిత్యం శుభ్రం చేయాలని, ఆరు నెలలకు ఒకసారి కొత్త బాటిళ్లను తెప్పించాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ బాటిళ్లకు బదులుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను యజమానులు చూసుకోవాలన్నారు. వాటర్‌ను సక్రమంగా ఫిల్టర్ చేయాలని, ప్లాంటు పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలన్నారు. ఫిల్టర్ కాగా మిగిలిన వ్యర్థ నీటిని విధిగా ఇంకుడు గుంతలు తవ్వించి అందులోకి వదలేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా, అపరిశుభ్ర తాగునీటిని పంపిణీ చేసినా అట్టి ప్లాంట్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఎడిటర్ ఇంట్లో సోదాలు అమానుషం

సాక్షి,రంగారెడ్డిజిల్లా: సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయ రెడ్డి ఇంట్లో ఏపీ పోలీసుల సోదాలు చేయడాన్ని తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీయూడబ్ల్యూజేఎఫ్) జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు గురువారం సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సత్యనారాయణ, ఎం.సైదులు ఓ ప్రకటన విడుదల చేశారు. ఓ బాధ్యత గల పత్రికా ఎడిటర్ ఇంట్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేయడం సరికాదన్నారు. నిబంధనలు, ప్రజాస్వామ్య పద్ధతులకు తిలోదకాలిస్తూ జర్నలిస్టులను భయ భ్రాంతులకు గురి చేసే విధంగా పోలీసులు వ్యవహరించడం అమానుషమన్నారు. పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా జర్నలిస్టులను భయపెట్టాలనే ఉద్దేశంతో ఏపీ పోలీసులు చట్టానికి విరుద్ధంగా వ్యవహరించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. తప్పు చేస్తే నిబంధనల ప్రకారం నడుచుకోవాలే కానీ ఏకపక్షంగా ఇళ్లలోకి చొరబడటం ఏమిటని ప్రశ్నించారు. ఎడిటర్ ధనంజయరెడ్డిపై పెట్టిన కేసులను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు.

కంటి పరీక్షలు తప్పనిసరి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బంట్వారం: వయస్సు పైబడిన వారంతా తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించకోవాలని తాండూరు ఎమ్మెల్యే బి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కోట్‌పల్లి మండల కేంద్రంలో ఎల్‌ఎన్‌ఆర్ యువసేన ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కంటి చూపు లేకపోతే మానవ జీవితం అంధకారమన్నారు. అశ్రద్ధ వహించకుండా కళ్లను జాగ్రత్తగా పరిరక్షించుకోవాలన్నారు. చూపు మసక బారిన వెంటనే అవసరమైన వైద్యం చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయులే ఆదర్శం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నూతన దంపతులతో నాయకులు

బొంరాస్‌పేట: జ్యోతిరావు, సావిత్రిబాయి పూలే, అంబేడ్కర్ రమాబాయి వంటి ఆదర్శ మూర్తులు నేటి యువ, నూతన దంపతులకు ఆదర్శం కావాలని అంబేడ్కర్ ప్రజాసంఘం తాలూకా అధ్యక్షుడు రమేశ్‌బాబు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఏర్పుమళ్లలో అంబేడ్కర్ సంఘం సభ్యుడు యాదయ్య, శిరీష వివాహ వేడుకలకు అంబేడ్కర్, బహుజన, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు హాజరయ్యారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి నూతన వధూవరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మహనీయుల అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, సూర్యా నాయక్, ఎఫ్ నర్సిములు, మాసని వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు గుండప్ప, వెంకట్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, ప్రశాంత్, రఘుపతి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ పేరుతో సైబర్ మోసం

ట్రేడ్ లైసెన్స్ బిల్లు చెల్లించాలని రూ.7వేలకు టోకరా

తాండూరు టౌన్: తాండూరు పట్టణ మున్సిపల్ కమిషనర్ పేరుతో ఫోన్ చేసి వెంటనే ఆన్‌లైన్‌లో ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలంటూ ఓ కేటుగాడు వ్యాపారికి టోపీ పెట్టాడు. ఈఘటన గురువారం తాండూరు పట్టణంలో చోటుచేసుకుంది. మున్సిపల్ సిబ్బంది వ్యాపారదుకాణాల నుంచి ట్రేడ్ లైసెన్సు ఫీజులను వసూలు చేస్తున్నారు. ఇదే అదునుగా ఓ సైబర్ మోసగాడు ఓ వ్యాపారికి ఫోన్ చేసి ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని చెప్పాడు.

ట్రూ కాలర్‌లో మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి అని పేరు వావడంతో, నిజంగా మున్సిపల్ కమిషనర్ ఫోన్ చేసి లైసెన్సు ఫీజు చెల్లించాలని సూచిస్తున్నాడని నమ్మాడు. వెంటనే యూపీఐ ద్వారా రూ.7 వేలు చెల్లించాడు. కొద్ది గంటల వ్యవధిలోనే మున్సిపల్ సిబ్బంది వెళ్లి ఫీజు చెల్లించాలని ఆ వ్యాపారిని కోరగా, ఇంతకు ముందే ఆన్‌లైన్‌లో చెల్లించానని చెప్పాడు. వెంటనే సిబ్బంది అతని చెల్లింపుపై ఆరా తీశారు. సదరు కాల్ కమిషనర్ నుంచి రాలేదని చెప్పడంతో మోసపోయానని లబోదిబోమన్నాడు.

నేరుగా చెల్లించాలి

ఈ సందర్భంగా పట్టణ మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి మాట్లాడుతూ.. ట్రేడ్ లైసెన్సు ఫీజును సిబ్బందికి నేరుగా చెల్లించాలని, లేదా ప్రభుత్వం ఇచ్చిన ఆన్‌లైన్ నంబర్‌కు మాత్రమే చెల్లించాలన్నారు. మోసగాడు 8247649631 నంబర్ నుంచి కాల్ చేసి డబ్బులు కొట్టేశాడన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ముప్పు

- కమాన్‌పట్టీలు విరగడంతో ప్రమాదం
- రోడ్డు కిందికి దూసుకెళ్లిన బస్సు
- 60 మంది ప్రయాణికులు సురక్షితం



కమాన్ పట్టీలు విరగడంతో రోడ్డు కిందికి దూసుకెళ్లిన బస్సు

చేవెళ్ల: ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు కమాన్ పట్టీలు విరిగిపోవడంతో అదుపు తప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బ్రేక్ వేసి, నియంత్రించడంతో పెను ప్రమాదమే తప్పింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని మీర్జాగూడ సమీపంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్ నుంచి కొండగల్, కోస్గి వెళ్తున్న కోస్గి ఆర్టీసీ బస్సు మీర్జాగూడ బస్ స్టేజీకి సమీపంలోకి రాగానే రోడ్డు మలుపు వద్ద కమాన్ పట్టీలు విరిగిపోయాయి. దీంతో బస్సు రోడ్డు కిందికి దూసుకెళ్లి, ఆగిపోయింది. ఈ సంఘటనతో అందులో ఉన్న సుమారు 60మంది ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బస్సు మరికొంత దూరం వెళ్లి ఉంటే బోల్తా పడి ఉండేదని చెప్పారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ప్రయాణికులను మరో బస్సులో పంపించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మా భూముల్లో సర్వే



మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో కొనసాగుతున్న సర్వే పనులు

కందుకూరు: ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను సర్వే చేయిస్తున్న అధికారులు వీటికి ఫెన్సింగ్ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం మీర్‌ఖాన్‌పేట సర్వే నంబర్ 112లోని భూమిని సర్వే చేశారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఫ్యూచర్ సిటీ సీఐ కృష్ణంరాజు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐదు రోజులుగా కొనసాగుతున్న సర్వేలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారు.

సన్నబియ్యంపై కన్ను!

- పక్కదారి పట్టించేందుకు దళారుల ప్రయత్నాలు
- లబ్ధిదారుల నుంచి సేకరించే పనిలో నిమగ్నం
- కిలోకు రూ.15 నుంచి రూ.20 చెల్లిస్తామంటూ మంతనాలు
- అధికారులు కఠినంగా వ్యవహరిస్తేనే అడ్డుకట్ట పడే అవకాశం



అంతారంలో పట్టుబడిన రేషన్ బియ్యంపై విచారణ చేస్తున్న అధికారులు (ఫైల్)

దౌల్తాబాద్: చౌక ధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న సన్నబియ్యాన్ని కొంతమంది అక్రమార్కులు పక్కదారి పట్టించే ప్రయత్నాలు ప్రారంభించారు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు స్పందించి దీన్ని అడ్డుకోవాలనే డిమాండ్లు ఊపందుకుంటున్నాయి.

కర్నాటకకు తరలింపు

దౌల్తాబాద్ మండలం కర్నాటక సరిహద్దుకు 6 కిలో మీటర్ల దూరంలో మాత్రమే ఉంది. ఆయా గ్రామాల్లో సన్నబియ్యం సేకరించేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారు. గతంలో రేషన్ ద్వారా అందించిన దొడ్డు బియ్యాన్ని రూ.10 చొప్పున సేకరించి, దళారులకు విక్రయించేవారు. అనంతరం వీటిని రీసైక్లింగ్ చేసి, కర్నాటకకు తరలించేవారు. ప్రస్తుతం ప్రభుత్వం అందజేస్తున్న సన్నబియ్యంపై వీరి కన్ను పడింది. దౌల్తాబాద్‌తో పాటు కోస్గి, మద్దూరు మండలాల్లో కొనుగోలు చేసిన బియ్యాన్ని ఒక చోట నిల్వ చేసి ఆతర్వాత మినీ వ్యాన్లు, ఆటోల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సన్నబియ్యం కిలోకు రూ.20 చెల్లిస్తామంటూ భేరసారాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

పెరుగుతున్న వ్యాపారుల సంఖ్య

సన్నబియ్యం తినేందుకు కొంతమంది లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. గతంలో దొడ్డు బియ్యం తరలిస్తూ పట్టుబడిన కొందరు వ్యాపారులు, వాహనాల డ్రైవర్లే ఈ విషయాన్ని చెబుతున్నారు. ఇలాంటి వారినుంచి సన్నబియ్యం సేకరించి, బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కర్నాటకకు సరిహద్దున ఉన్న దౌల్తాబాద్ మండలం దళారుల అక్రమ వ్యాపారానికి అనుకూలంగా ఉంది.

6–ఏ కేసులతో సరి

మండలంలో గతంలో సబ్సిడీ బియ్యం పట్టుకున్న సందర్భాల్లో అధికారులు 6– ఏ కేసులతో సరి పెట్టారు. ఈ బియ్యం ఎక్కడి నుంచి వచ్చాయి..? వ్యాపారి ఎవరు? అనే కోణంలో విచారణ చేస్తే అసలు సూత్రధారులు తెలిసే అవకాశం ఉంటుంది. కానీ అవేవీ పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ఎప్పటిలాగే వారి పని కానిచ్చేస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ, సివిల్ సప్లయ్ యంత్రాంగం దృష్టి సారిస్తేనే అక్రమ దందాకు అడ్డుకట్ట పడుతుంది. ఆదిశగా చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు ఊపందుకుంటున్నాయి.

వాహనాల తనిఖీ



కోహెడ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఏసీపీ రాజు, సీఐ జగదీశ్

ఇబ్రహీంపట్నం: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోహెడ క్రాస్ రోడ్డు వద్ద గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. కోహెడ, రాందాసుపల్లి గ్రామాలకు వెళ్లే రహదారిలో ఎవరైనా సాయంత్రం వెళల్లో ద్విచక్ర వాహనాన్ని నిలిపితే గుర్తు తెలియని దుండగులు వారిని బెదిరించి దోపిడీలకు పాల్పడుతున్న సంఘటనలు తెలిసిందే. ఈ నేపథ్యంలో పకడ్బందీగా శాంతి భద్రతల నిర్వహణకు ఏసీపీ కేపీవీ రాజు నేతృత్వంలో సీఐ జగదీశ్ పోలీసు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఏసీపీ రాజు సూచించారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

- సేంద్రియ సాగుతో సత్ఫలితాలు
- రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషన్ సభ్యుడు రాములు నాయక్
- ఎర్వగూడలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

శంకర్‌పల్లి: రాష్ట్రంలోని రైతులు ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేసి, అధిక దిగుబడులు సాధించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషన్ సభ్యుడు రాములునాయక్ అన్నారు. గురువారం శంకర్‌పల్లి మండలం ఎర్వగూడ గ్రామంలో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అన్నదాతలు అధిక లాభాలు పొందాలనే ఉద్దేశంతోనే వ్యవసాయశాఖ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో గ్రామగ్రామాన అవగాహన సమావేశాలను నిర్వహిస్తోందని తెలిపారు. ముఖ్యంగా రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. శాస్త్రవేత్త శర్మ మాట్లాడుతూ.. రైతులు పంట మార్పిడిని అలవాటు చేసుకోవాలని, ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు చేయించి, ఎరువులు వాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు లక్ష్మి, చేవెళ్ల ఏడీఏ సురేశ్ బాబు, శంకర్‌పల్లి ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి సురేశ్ బాబు, ఏఈఓ మనీషా, ఏఎంసీ మల్లేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యూరియాను తగ్గించాలి

షాబాద్: పంటల సాగులో యూరియా వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచుకోవాలని వ్యవసాయశాఖ సీనియర్ శాస్త్రవేతలు డాక్టర్ పి.సతీష్, శాస్త్రవేత్త డాక్టర్ డి.శిరీష, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. పోలీపేట్, లక్ష్మారావుగూడ గ్రామాల్లో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేతలు అవగావాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు సాధించడమే కాకుండా ఆరోగ్యకరమైన ఉత్పత్తులను ప్రజలకు అందించవచ్చని తెలిపారు. పంట మార్పిడిని పాటించాలని సూచించారు. పచ్చిరొట్ట సాగు ద్వారా ఎరువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాశాఖ అధికారి వెంకటేశం, ఏఈఓలు గీత, రాజేశ్వరి, కిరణ్మయి, వ్యవసాయ విద్యార్థులు ప్రవీణ్‌కుమార్, శ్రీను, అవనిజ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో దున్ను.. దిగుబడులకు దన్ను

- లోతైన దుక్కులతో పంటలకు పుష్టి
- తొలకరి వర్షాలకే విత్తనాలు వేసుకునే అవకాశం
- ఏటవాలు సాళ్లతో భూమి కోతకు అడ్డుకట్ట
- వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం



షాబాద్ మండలం మక్తగూడలో దుక్కి దున్నుతున్న కాడెద్దు

షాబాద్: పంటల సాగులో శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాని ఏఓ వెంకటేశం తెలిపారు. పలు సందర్భాల్లో రైతులు తీసుకునే సొంత నిర్ణయాలు దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. వేసవి దుక్కులతో కలిగే లాభాలను వివరించారు.

- పంట కొయ్యలను కాల్చకుండా, కలియదున్నాలి.
- వేసవిలో లోతు దుక్కులతో చాలా ప్రయోజనాలున్నాయి.. పురుగులు, తెగుళ్లు, కలుపును నివారించడంతో పాటు భూమి పొరల్లో వర్షపునీరు ఇంకి పంటకు ఉపయోగపడుతుంది.
- ఏప్రిల్, మే నెలలు వేసవి దుక్కులకు అనుకూలం.
- అడ్డం, పొడవు సాళ్లలా కాకుండా ఏటవాలుగా దున్నడం శ్రేయస్కరం.
- ఏటవాలు దుక్కులతో భూమి కోతకు గురికాకుండా ఉంటుంది.
- లోతుగా దున్నినప్పుడు పంటలకు హాని చేసే క్రిమికీటకాలతో పాటు లార్వా దశలో ఉండే గుడ్లు సూర్యకిరణాలు పడి నాశనమవుతాయి.
- తొలకరి వర్షాలు కురిసిన వెంటనే విత్తనాలు వేసుకునే అవకాశం కలుగుతుంది.
- అంతకుముందే రెండుసార్లు దున్నితే గట్టిగా ఉన్న భూమి గుల్లబారుతుంది.
- ఇది కలుపును నియంత్రించడంతో పాటు నేలలో ఎక్కువ కాలం తేమ నిల్వ ఉండేలా దోహదపడుతుంది.
- భూమి పొరల్లోకి గాలి చేరుతుంది.
- సూక్ష్మజీవుల సాంద్రత, సేంద్రియ కర్బన వినియోగం పెరుగుతుంది.
- మొక్క వేటిని నేరుగా గ్రహించే అవకాశం ఉంటుంది.
- కలుపు, పురుగు మందుల అవశేషాలతో మొక్కలకు కీడు కలగకుండా ప్రభావం చూపుతుంది.
- గాలిలో ఉన్న నత్రజని వర్షపు నీటితో కలిసి భూమిలోకి చేరడం వల్ల భూసారం పెరుగుతుంది.
- పురుగుమందులు, తెగుళ్ల మందుకయ్యే పెట్టుబడిని తగ్గించుకోవచ్చు.